సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం । 1 । ఆగస్టు । 2023



రైతును ముంచిన గోదావరి

నాలుగు రోజుల పాటు గోదావరి వదర పోటెత్తడంతో భద్రాచలం డివిజన్‌లో 10వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. 8లో



.. దిగుబడి ఎక్కువ

జిల్లాలో పలువురు రైతులు నూతన విధానాల్లో సాగు చేస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధిస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
29° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు లేదా చిరు జల్లులు కురుస్తాయి.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ

అశ్వాపురం: ఈ నెల 11న జరిగే మణుగూరు భారజల కర్మాగారం ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికల్లో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. దీంతో బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలను ఎన్నికల అధికారి మోహన్‌కుమార్ వెల్లడించారు. ఆఫీస్ బేరర్ తొమ్మిది స్థానాలకు 34 మంది నామినేషన్లు వేయగా 10 మంది ఉపసంహరించుకున్నారని తెలిపారు. 12 ఎగ్జిక్యూటివ్ స్థానాలకు 14 మంది నామినేషన్లు వేయగా ముగ్గురు ఉపసంహరించుకోగా 11 మంది పోటీలో ఉన్నారని, పలు స్థానాల్లో ఒక్కో అభ్యర్థి మాత్రమే పోటీలో ఉండగా వారు ఏకగ్రీవంగా ఎన్నికవనున్నారని పేర్కొన్నారు. గౌరవాధ్యక్ష పదవికి పి.ప్రతాపరెడ్డి, నాగమల్ల లక్ష్మీనారాయణ, మదమంచి వెంకటేష్, అధ్యక్ష పదవికి కూరపాటి శ్రీనివాసరావు, సీహెచ్.బాల, ప్రధాన కార్యదర్శికి ఎం.జానకి రాములు, పోతురాజు శ్రీనివాసరావు, వై.సుధీర్‌కుమార్ బరిలో ఉన్నారని వివరించారు.

లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలి

చుంచుపల్లి: బ్యాంకర్లు నిర్దేశించిన విధంగా రుణాలు మంజూరు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు అన్నారు. సోమవారం ఐడీఓసీలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రూ.5,599.03 కోట్ల రుణ లక్ష్యం కాగా, వ్యవసాయనికి రూ.4,309.58 కోట్లు, చిన్న తరహా పరిశ్రమలకు రూ.486.45 కోట్లు, విద్యారంగానికి రూ.202.81 కోట్లు, గృహ నిర్మాణానికి రూ. 536.19 కోట్లు, ఇతర మౌలిక వసతులకు రూ.50.18 కోట్ల చొప్పున ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. సమావేశంలో ఎల్డీఎం రామిరెడ్డి, నాబార్డ్ డీడీఎం సుజిత్ పాల్గొన్నారు.

నాలుగు నెలలకోసారి పెన్షన్ అదాలత్



అసిస్టెంట్ కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం) : ప్రతి నాలుగు నెలలకు ఒకసారి పెన్షన్ అదాలత్ నిర్వహిస్తామని, రిటైర్డ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కనకమ్మ అన్నారు. సింగరేణి కొత్తగూడెం జీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెన్షన్ తీసుకుంటున్న రిటైర్డ్ ఉద్యోగులు తమ బ్యాంకు ఖాతాలను ఫార్మర్ సర్వేయర్‌గా మార్చుకుని నామినీ ఆధార్‌కార్డును సీఎంపీఎఫ్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దీంతో పెన్షనర్ మృతిచెందితే నామినీ వెంటనే పెన్షన్ పొందవచ్చన్నారు. అంతకు ముందు ఏరియా జీఎం శాలేంరాజు కనకమ్మకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సమావేశంలో ఎస్వోటుజీఎం కోటిరెడ్డి, పర్సనల్ ఏజీఎం సామ్యూల్ సుధాకర్, డీజీఎం సుమలత, సీనియర్ పీఓలు ఎం.మురళి, జి.సుధాకర్, కె.దేవదాసు, విజయ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాల ఎంపికలు వాయిదా

కొత్తగూడెంటౌన్: రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల కోసం ఈనెల 3న హైదరాబాద్ హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో జరగనున్న ఎంపికలు 10వ తేదీకి వాయిదా పడ్డాయని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి టి.సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే బాల బాలికలు 9వ తేదీన హకీంపేట క్రీడా పాఠశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు.



దశరథ రాముడి ఇతివృత్తంలో కీలకం రామరావణుల యుద్ధం. పది తలల రావణాసురుడిని హతమార్చేందుకు రాముడు ఏకధాటిగా గంటల కొద్దీ బాణాలు సంధిస్తూనే ఉన్నాడట. ఒక తల పోతే మరో తల అన్నట్టుగా రావణుడు నేలకూలకుండా మళ్లీ మళ్లీ వికటాట్టహాసం చేస్తూనే ఉన్నాడని పురాణాల్లో చదివాం. బాణాలు వేసి రాముడు అలసిపోయాడే కానీ శరాఘాతం తగిలిన రావణుడికి కించిత్ బాధ కూడా లేదట. చివరకు రావణుడి ప్రాణం ఎక్కడుందో విభీషణుడి నుంచి సత్యం తెలుసుకున్న రాముడు.. తలను కాకుండా నాభిని గురి చూసి కొట్టడంతో పది తలల రావణుడి ఆయువు పరిసమాప్తమైన విషయం మనకు తెలిసిందే.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

విల్లు.. విఫలమే!

ఎన్ని బాణాలు వేసినా వ్యర్థమేనా ?

- సమస్య తీరదు, బాధ తొలగదు
- భద్రాద్రిని పీడిస్తున్న డ్రెయినేజీ సమస్య
- ప్రతీసారి ఎత్తిపోతలపైనే అధికారుల దృష్టి
- శాశ్వత పరిష్కారంపై దృష్టి పెట్టని వైనం



గతేడాది రామాలయం చుట్టూ చేరిన స్లూయిజ్‌ల లీకేజీ వరద(ఫైల్)

రాముడు కొలువైన భద్రాద్రిలోనూ రామరావణ యుద్ధం తరహా పరిస్థితి కనిపిస్తోంది. వానాకాలం వచ్చిందంటే చాలు గోదావరి వరదతో సంబంధం లేని స్థానిక వరద, అది వదిలి వెళ్లే బురద, తద్వారా వచ్చే కంపు వాసనతో ఆలయ పరిసర ప్రాంతాల్లో ఇబ్బందికర పరిస్థితి ఎదురువుతోంది. వరద నీరు, పట్టణంలో వెలువడే మురుగు నీరు ఎత్తి పోసేందుకు పదుల సంఖ్యలో మోటార్లు వాడినా ఫలితం అంతంతే. ఆలయం చుట్టూ, అన్నదాన సత్రం, విస్తా కాంప్లెక్స్, శ్రీరామదాసు షాపింగ్ కాంప్లెక్స్‌లను చుట్టుముట్టే వరదను ఎత్తి పోయడానికే తప్ప సమస్య పూర్తిగా పరిష్కారం కావడం లేదు. పైగా అధికారులు ఈ వరదను సవాల్‌గా తీసుకుని శక్తివంతమైన మోటార్లను తాత్కాలికంగా ఉపయోగించే క్రమంలో కరకట్ట మనుగడకూ ముప్పు వాటిల్లుతోంది.

35 దాటితే చాలు

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో గోదావరి బేసిన్‌లో కురిసే వాన, తద్వారా వచ్చే వరద గోదావరిలో కలిసి రాష్ట్రంలో చివరగా భద్రాచలం చేరుతుంది. దీంతో ప్రతీ సీజన్‌లో తీరప్రాంత ప్రజలకు వరద ముప్పు తప్పడం లేదు. గోదావరి వరద నీటిమట్టం 53 అడుగులు దాటితే లోతట్టు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు మొదలవుతాయి. 60 అడుగులు వస్తే ఇళ్లలోకి నీరు చేరుతుంది. అంతకంటే ముందు ఈ వరద 35 అడుగులు దాటితే చాలు ఆలయం చుట్టూ ఉన్న పరిసరాలు చిక్కుల్లో పడ్డట్టే. గోదావరిలో వరద 35 అడుగులు దాటితు పట్టణంలో వెలువడే మురికినీరు, వాన వల్ల వచ్చే వరద నీరు సహజంగా గోదావరిలో కలిసే వీలుండదు. మోటార్ల ద్వారా ఎత్తిపోయాల్సిందే. నాలుగు సెంటీమీటర్లకు మించి వర్షం కురిసినా వరద నీరు పోటెత్తి ఆలయ ప్రాంగణాన్ని ముంచెత్తుతోంది. ఇలాంటి గడ్డు పరిస్థితి ఏడాదిలో 30 రోజులకు తగ్గకుండా ఉంటుంది.

డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తే

భద్రాచలం పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన మురుగునీరు, వరద కారణంగానే ఆలయ ప్రాంగణంలో సమస్య తలెత్తుతోంది. ఈ నీటిని మళ్లించేందుకు కొత్త డ్రైనేజీ వ్యవస్థను సిద్ధం చేస్తే ఇబ్బంది ఉండదు. కానీ ఈ దిశగా ప్రయత్నించకుండా ఎంతసేపూ రావణుడి తలకు బాణం వేసినట్టుగా మురుగునీరు ఎత్తిపోతల మీదనే అంతా దృష్టి కేంద్రీకరిస్తున్నారు. దీంతో అధికారులు, కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం రాకపోగా నిధులన్నీ వరదలో పోసినట్టు నిష్ఫలం అవుతున్నాయి. ఈ పరిస్థితిని వంద శాతం పట్టిచూపేలా.. వరద, మురుగునీరు ఎత్తిపోసే చోటనే కరకట్ట మీద నట్టనడుమ రావణుడి పది తలలకు బాణాలు వేస్తున్న రాముడి విగ్రహాలు కూడా కొలువుదీరి ఉన్నాయి. ఇకనైనా తలకు బదులు నాభి అన్నట్టుగా ఎత్తిపోతల బదులు సరికొత్త డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటుపై దృష్టి సారించాలని రామయ్య భక్తులు, స్థానికులు కోరుతున్నారు.

దెబ్బతింటున్న కరకట్ట



నీటి డంపింగ్‌తో దెబ్బతింటున్న కరకట్ట

పైపుల ద్వారా ఎత్తిపోస్తున్న వరద కరకట్టపై నేరుగా పడడంతో దానిపైనున్న రివిట్‌మెంట్‌కు ఉన్న సిమెంట్ ఇప్పటికే కొట్టుకుపోయి బలహీనడింది. గతేడాది వరద సందర్భంగా ఇలా కరకట్ట బలహీనపడిన చోట తాత్కాలికంగా కాంక్రీట్ దిమ్మలు వేసి, ఇసుక బస్తాలతో నింపారే తప్ప శాశ్వత ప్రతిపాదికన మరమ్మతులు చేయలేదు. ఈసారి ఏకంగా 320 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా వచ్చే నీరు నేరుగా కరకట్టపైనే పడుతోంది. దీంతో మరోసారి కట్ట భద్రతకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది.

పెరుగుతున్న వ్యయం

ఈ వరద నీటిని ఎత్తిపోయడమే లక్ష్యంగా ఇటు పాలకులు, అటు అధికారులు అహోరాత్రులు శ్రమిస్తున్నారు. గోదావరిలో వరద ఎంత వచ్చినా లోకం పట్టించుకోదు కానీ ఆలయ పరిసరాలు నీటిలో మునిగితే వచ్చే చెడు ప్రచారమే ఎక్కువ కాబట్టి ఈ పని పైనే దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలో వివిధ ఏజెన్సీల నుంచి బాహుబలి మోటార్లు సైతం తెప్పిస్తున్నారు. ఈ వానాకాంలో అయితే ఏర్పాటుచేసిన అన్ని మోటార్ల సామర్థ్యం ఏకంగా1650 హెచ్‌పీకి చేరుకోవడం గమనార్హం. ఈ మోటార్ల తరలింపు, బిగింపు, నిర్వహణకు ప్రతీ ఏడాది రూ.70 లక్షల నుంచి రూ. కోటి వరకు ఖర్చవుతోంది. తెలంగాణ వచ్చిన తర్వాత కేవలం వరద నీరు ఎత్తిపోసేందుకే దాదాపు రూ.10 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇంత చేసినా ఇటు బురద సమస్య పూర్తిగా తీరిపోవడం లేదు. మరోవైపు కరకట్ట భద్రత ప్రశ్నార్థకం అవుతోంది.

ఉమ్మడి జిల్లాకు 38 వాహనాలు

108, 102 వాహనాలను కేటాయించిన ప్రభుత్వం

ఖమ్మం వైద్యవిభాగం: తరచూ మరమ్మతులకు గురవుతూ అప్పుడప్పుడు మొరాయిస్తున్న 108, 102 వాహనాల స్థానంలో ప్రభుత్వం కొత్తవి కేటాయించింది. ఈమేరకు పాత వాహన స్థానంలోనే కాకుండా కొత్తగా కూడా మరికొన్ని వాహనాలు సమకూర్చింది. రాష్ట్రంలో అవసరాల కోసం 466 వాహనాలను కొనుగోలు చేయగా, వీటిని మంగళవారం హైదరాబాద్‌లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారు. ఇందులో 38 వాహనాలు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 108 వాహనాలు 17 ఉండగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 11, ఖమ్మం జిల్లాలో ఆరు వాహనాలు తిరుగుతున్నాయి. వీటి స్థానంలో కొత్తవి కేటాయించడమే కాక ముదిగొండ, రఘునాథపాలెంకు ఒక్కో వాహనం కలిపి 19 వాహనాలను ప్రభుత్వం సమకూరుస్తోంది. ఇక 102 వాహనాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తొమ్మిది, ఖమ్మం జిల్లాలో ఏడు ఉండగా వీటికి బదులుగా కొత్తవి కేటాయించి, జిల్లాకొకటి స్పేర్ వాహనం కూడా అందుబాటులోకి తీసుకొస్తారు. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు ఒక పార్థీవ వాహనాన్ని కేటాయించారు. ఆయా వాహనాలు రెండు, మూడు రోజుల్లో జిల్లాకు చేరుకోనుండగా, అప్పటివరకు పాత వాహనాలు యథావిధిగా తిరుగుతాయని 108 ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భూమా నాగేందర్ తెలిపారు.


సాగులో ఉన్న వారందరికీ హక్కుపత్రాలివ్వాలి

చర్ల: పోడు భూముల హక్కు పత్రాలు జారీ విషయంలో నిర్లక్ష్యాన్ని వీడి సాగులో ఉన్న రైతులందరికీ హక్కుపత్రాలు ఇవ్వాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన లేఖ విడుదల చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో సాగులో ఉన్న 11.50 లక్షల ఎకరాల పోడు భూములను పూర్తి స్థాయిలో పట్టాలు ఇవ్వాలని కోరారు. అంతేకాక ఉచితంగా బోర్లు వేసి, సాగునీటి సౌకర్యం కల్పించాలని, అందరికీ రైతుబంధు వర్తింప జేయాలని డిమాండ్ చేశారు. వలస ఆదివాసీలకు కూడా హక్కుపత్రాలను జారీ చేయాలని, ఆదివాసీలపై పెట్టిన కేసులను రద్దు చేయాలని కోరారు.

నిచ్చెన దిగి.. చికిత్స చేసి



వాగు వద్ద నిచ్చెన దిగుతున్న వైద్య సిబ్బంది



సాయనపల్లిలో పరీక్షలు చేస్తున్న మనీష్‌రెడ్డి

సాయనపల్లిలో వైద్య శిబిరం

గుండాల: మండలంలోని సాయనపల్లిలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. అయితే ఇటీవలి వర్షాలకు గుండాల – సాయనపల్లి గ్రామాల మధ్యనున్న మలన్న వాగు బ్రిడ్జికి రెండు వైపులా రోడ్డు కోతకు గురైంది. దీంతో స్థానికులు ఏర్పాటుచేసిన నిచ్చెన సాయంతో బ్రిడ్జి నుంచి దిగిన సిబ్బంది గ్రామానికి చేరుకుని ప్రజలకు చికిత్స చేశారు. మండలంలో ఆదివారం పర్యటించిన కలెక్టర్ ప్రియాంక ఆల ఆదేశాల మేరకు వైద్యాధికారి మనీష్ రెడ్డి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. 45 మందికి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ఇళ్ల చుట్టూ, వీధుల్లో బ్లీచింగ్ చల్లించుకోవాలని మనీష్‌రెడ్డి సూచించారు. నీరు నిల్వ ఉండకుండా చూడాలని, కాచి చల్లార్చిన తర్వాత వడగట్టిన నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీహరి, ఎంటీఎస్ సత్యం, ఏఎన్ఎం కమల, ఎంఎల్‌హెచ్‌పీ సంగీత, హెల్త్ అసిస్టెంట్ రాఘవులు, ఆశా వర్కర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రియాంక పిలుపు



గ్రీవెన్స్‌లో దరఖాస్తు అందిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల పిలుపునిచ్చారు. ఐడీఓసీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో వారోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తల్లిపాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కె.వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రాజు, డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష, ఆస్పత్రుల సమన్వయ అధికారి రవిబాబు, మహిళా, శిశు సంక్షేమాధికారి సబిత, ఉపాధి కల్పన అధికారి విజేత పాల్గొన్నారు.

వరద నష్టాల నివేదిక అందించాలి

జిల్లాలో వరద నష్టాల నివేదికలను అందజేయాలని కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. ఐడీఓసీలో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద సహాయక చర్యల్లో అధికారుల పనితీరును అభినందించారు. వర్షాలు, వరదలతో దెబ్బతిన్న పంటలు, పశువులు, ఇళ్లు, పిడుగుపాటు తదితర అంశాలపై సమగ్ర నివేదికలు రూపొందించాలని సూచించారు. ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో నాలుగు వంతెనలు దెబ్బతిన్నాయని, పంచాయతీరాజ్ పరిధిలో 97 రహదారులు మరమ్మతులకు గురి కాగా 60 పనులు పూర్తి చేశామని తెలిపారు. 11 చోట్ల దెబ్బతిన్న పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. వచ్చిన దరఖాస్తులలో కొన్ని..

- ఇల్లెందు సీఎస్పీ బస్తీకి చెందిన ఆదివాసీ వ్యవసాయదారులు.. తాము 1987 నుంచి పట్టా భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్నామని సింగరేణి అధికారులు జేకే 5 ఓసీ ఏర్పాటుకు సర్వే నిర్వహించి ఏర్పాటు చేసిన హద్దుల ప్రకారం తమ భూములను కోల్పోతున్నామని, జీవనోపాధి కల్పించాలని దరఖాస్తు చేయగా రెవెన్యూ అధికారులకు ఎండార్స్ చేశారు.
- పాల్వంచ నవభారత్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో సౌకర్యాలు లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది నిర్లక్ష్యంతో తప్పుదోవ పడుతున్నారని విద్యార్థి, యువజన సంఘాలు దరఖాస్తు చేయగా త్వరలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.
- కొత్తగూడెం మున్సిపాలిటీ నాలుగో వార్డులో కాలువల నిర్మాణం మంజూరైనా ప్రారంభించలేదని బీజేపీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్ అగర్వాల్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు జోగు ప్రదీప్ తదితరులు ఫిర్యాదు చేయగా కమిషనర్‌ను పిలిచి సమస్యపై ఆరా తీశారు. సంబంధిత వార్డు కౌన్సిలర్, చైర్‌పర్సన్‌ను ఆహ్వానించి పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంటౌన్: ఆదివాసీ, గిరిజన తెగలు సంప్రదాయ పండుగలు జరుపుకుంటూ సంస్కృతిని కాపాడుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకునేలా సహకరిస్తామని చెప్పారు. ఈ మేరకు కార్యాచరణ సమర్పించాలని సూచించారు. ఏజెన్సీలోని ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఐటీడీఏను ఏర్పాటు చేయగా.. విద్యార్థులు ఉన్నత చదువులకు ముందుకొస్తే అండగా నిలుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, ఏసీఎంఓ రమణయ్య, ఆదినారాయణ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గోదారి తగ్గింది..



భద్రాచలం వద్ద నెమ్మదిగా ప్రవహిస్తున్న గోదావరి

- భారీగా పడిపోతున్న నీటిమట్టం
- ప్రమాద హెచ్చరికల ఉపసంహరణ
- పునరావాస శిబిరాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్న నిర్వాసితులు

భద్రాచలం: పది రోజులుగా భద్రాచలం ఏజెన్సీ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన గోదావరి శాంతించింది. నదికి ఎగువన ఉన్న ప్రాజెక్టు గేట్లను మూసివేయడంతో ప్రవాహం భారీగా తగ్గింది. దీంతో ఆదివారం మూడో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించిన అధికారులు.. అర్ధరాత్రి 2 గంటలకు 48 అడుగులకు దిగువన నీటిమట్టం నమోదు కావడంతో రెండో ప్రమాద హెచ్చరికను, సోమవారం మధ్యాహ్నం 1 గంటకు 42.60 అడుగులు నమోదు కావడంతో మొదటి ప్రమాద హెచ్చరికను సైతం తొలగించారు. క్రమంగా తగ్గుతూ వస్తున్న గోదావరి రాత్రి 11 గంటలకు 37.50 అడుగులతో 6,87,210 క్యూసెక్కుల మేర ప్రవహిస్తోంది.

శిబిరాలు ఖాళీ..

గోదావరి నీటిమట్టం 40 అడుగుల దిగువకు చేరడంతో దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు మండలాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో ఉన్న నిర్వాసితులు ఒక్కొక్కరుగా ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇళ్లలోకి చేరిన కొద్దిపాటి వరదను శుభ్రం చేసి సామాన్లు సర్దుకుంటున్నారు. ప్రధాన రహదారులపైకి చేరిన వరద బురదను అధికారులు డోజర్ల ద్వారా తొలగిస్తున్నారు. కాలనీలు, గ్రామాల్లో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో బ్లీచింగ్, క్లోరినేషన్ పనులు చేపడుతున్నారు.

సమ్మె చేస్తున్నా స్పందించరా ?

- పంచాయతీ కార్మికులను ప్రభుత్వం ఇబ్బంది పెడుతోంది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని
- విపక్షాల ఆధ్వర్యంలో ప్రదర్శన, కలెక్టరేట్ ముట్టడి



ధర్నాలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/చుంచుపల్లి: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుంటే స్పందించని రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందని, వారి శ్రమను దోచుకుంటూ గోస పెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. పంచాయతీ కార్మికుల జేఏసీ, విపక్షాల ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. వేతనాలు పెంచుతూ జారీ చేసిన జీఓ 60ని ఎందుకు అమలు చేయరో చెప్పాలన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నో ఉద్యమాలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజల కనీస అవసరాలు తీరుస్తున్న కార్మికులకు చట్టబద్ధమైన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, ప్రమాద బీమా, గ్రాట్యుటీ, గుర్తింపు కార్డులు, సెలవులు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు ఎస్‌కే సాబీర్ పాషా, అన్నవరపు కనకయ్య, కెచ్చల రంగయ్య, ఆవునూరి మధు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఆయా పార్టీల, సంఘాల నాయకులు గుత్తుల సత్యనారాయణ, ఏజె రమేష్, ఎల్.విశ్వనాథం, వాసిరెడ్డి మురళి, యూసుఫ్, వీరన్న, యాకూబ్ షావలి, సారంగపాణి, అమర్‌నాథ్, కొలగాని బ్రహ్మచారి, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

జరిగిన నష్టానికి ప్రభుత్వానిదే బాధ్యత

పాల్వంచరూరల్: నాగారం వద్ద కిన్నెరసాని వాగులో రూ.12.74 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో వరదకు కొట్టుకపోగా కూనంనేని సాంబశివరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లేమితోనే ఇలా జరిగిందని ఆరోపించారు. దీనికి అధికారులు, ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు.

క్లుప్తంగా

కొత్తగూడెం ఏరియాలో 106 శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం షాలెంరాజు

సింగరేణి(కొత్తగూడెం): జూలైలో భారీ వర్షాలు కురిసినా సింగరేణి కొత్తగూడెం ఏరియాలో నిర్దేశిత 10.19 లక్షల టన్నులకుగాను 10.72 లక్షల టన్నుల(106శాతం) బొగ్గు ఉత్పత్తి నమోదైంది. ఈమేరకు సోమవారం వివరాలను ఏరియా జీఎం షాలెం రాజు వెల్లడించారు. గడిచిన నాలుగు మాసాల్లో 40.54 లక్షల టన్నుల లక్ష్యానికి 51.52 లక్షల టన్నులు(127 శాతం) ఉత్పత్తి జరగగా, జూలైలో 256 రేక్‌ల బొగ్గును రవాణా చేసి సంస్థ వ్యాప్తంగా ఏరియా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కాగా, జేవీఆర్‌ఓసీ–2లో 7.50 లక్షల టన్నుల లక్ష్యానికి 7.87 లక్షల టన్నులు(105 శాతం), కిష్టారం ఓసీలో 1.50 లక్షల టన్నుల లక్ష్యానికి 1.98 లక్షల టన్నులు(132 శాతం) సాధించిందని తెలిపారు. అంతేకాకుండా గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రమాద రహితంగా ఉత్పత్తి జరుగుతోందని.. తొమ్మిదేళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడే ఇలా జరిగిందని జీఎం చెప్పారు. ఈ సమావేశంలో అధికారులు కోటిరెడ్డి, వెంకటేశ్వరరావు, సామ్యేల్ సుధాకర్, రామకృష్ణ, యోహాన్, రమణారెడ్డి, మురళి, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోడు సాగుదారులపై కేసు కొట్టివేత

బూర్గంపాడు: పోడు సాగుదారులను తమను అక్రమంగా నిర్బంధించారని ఫారెస్ట్ అధికారులు పెట్టిన కేసును సోమవారం భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి ఎం.వెంకటేశ్వర్లు కొట్టివేశారు. 2016 ఇరవెండి ఫారెస్ట్‌బీట్‌లో 17మంది గిరిజనులు పోడు సాగు చేస్తుండగా అడ్డుకున్న తమను నిర్బంధించారని ఫారెస్ట్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఔషధ మొక్కలను, కర్రలను ధ్వంసం చేసి ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసుపై సుదీర్ఘ విచారణ జరిపిన అనంతరం జడ్జి వెంకటేశ్వర్లు పోడుసాగుదారులను నిర్దోషులుగా తీర్పునిచ్చి కేసు కొట్టేశారు. ఈ కేసులో డిఫెన్స్ లాయర్‌గా పామరాజు తిరుమలరావు వాదించారు.

ఎమ్మెల్యేను కించపరిచేలా పోస్టులు : కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: సామాజిక మాధ్యమాల్లో ఓ వ్యక్తి ఎమ్మెల్యేను కించపరిచేలా పోస్టులు పెట్టడంతో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామం పేరుతో ఉన్న వాట్సాప్ గ్రూపులో అదే గ్రామానికి చెందిన మల్లు అనే వ్యక్తి అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును కించపరిచేలా ఆదివారం రాత్రి పలు మార్లు పోస్టులు పెట్టాడు. దీంతో బీఆర్‌ఎస్ నాయకుడు తుంపాటి రమేష్ ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నలుగురి అరెస్ట్

అశ్వాపురం: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సమీపంలో గత నెల 7న రాత్రి భారజల కర్మాగారం రిటైర్డ్ ఉద్యోగి రాంప్రసాద్ ఫాం హౌస్‌లో జరిగిన చోరీ కేసులో నలుగురు వ్యక్తులను సోమవారం అశ్వాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏడో తేదీ రాత్రి ఆమెర్ద రహదారి వెంబడి ఉన్న రాంప్రసాద్ ఫాంహౌస్‌లో నలుగురు వ్యక్తులు ఆటోలో వచ్చి తలుపు తాళం పగులగొట్టి ఇంట్లో సామగ్రి దొంగిలించారు. సీఐ రవీందర్ పర్యవేక్షణలో ఎస్‌ఐ సురేష్ ఆధ్వర్యంలో నిందితులు, చింతిర్యాలకాలనీ గ్రామానికి చెందిన మన్నం బ్రహ్మనాయుడు, మోతుకూరి సందీప్, పిట్టా ప్రేమ్‌కుమార్, నిమ్మల ఉదయ్‌సాగర్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. సామాన్లు స్వాధీనం చేసుకొని ఆటోను సీజ్ చేశారు.

ఇద్దరికి జీవిత ఖైదు

కొత్తగూడెంటౌన్: తమ్ముడిని హత్య చేసిన ఇద్దరు అన్నలకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా.. పాల్వంచ మండలం రేపల్లెవాడ ఎస్సీ కాలనీ చెందినకి బింగి శ్రీనుపై అతని సోదరులు బింగి కోటేష్, బింగి వెంకటేశ్వర్లుతోపాటు సావిత్రి, భద్రం దాడికి పాల్పడ్డారు. 13.6.2016న రాత్రి ఒంటరిగా వస్తుండగా కర్రలతో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య పార్వతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టులో నలుగురిపై చార్జిషీట్ దాఖలు చేశారు. న్యాయమూర్తి 14 మంది సాక్షులను విచారించగా బింగి వెంకటేశ్వర్లు, బింగి కోటేష్‌లపై నేరం రుజువుకావడంతో జీవితఖైదుతోపాటు రూ.1000 జరిమానా విధించారు. మిగిలిన ఇద్దరు బింగి సావిత్రి, బింగి భద్రంలను నిర్దోషులుగా ప్రకటించారు. ప్రాసిక్యూషన్ తరఫున పోసాని రాధాకృష్ణమూర్తి వాదించారు. లైజన్ ఆఫీసర్ ఎస్.వీరబాబు, పాల్వంచ రూరల్ కోర్టు డ్యూటీ ఆఫీసర్ సింగి వెంకటేష్ సహకరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

రైతును ముంచిన గోదావరి

- దాదాపు 10 వేల ఎకరాల్లో పంటలు నీటమునక
- పూర్తిగా దెబ్బతిన్న పత్తి, వరినార్లు
- ప్రభుత్వం ఆదుకోకపోతే సాగు సంకటమే



గోదావరి వరదలకు దెబ్బతిన్న పత్తిచేను

బూర్గంపాడు: ప్రకృతి వైపరీత్యాలతో రైతులు కోలుకోలేకపోతున్నారు. గతేడాది గోదావరి వరద నష్టాల నుంచి తేరుకోకముందే ఈ ఏడాది వరదలు నిండా ముంచాయి. నాలుగు రోజులపాటు పోటెత్తిన వరదకు భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో సుమారు 10 వేల ఎకరాల వరకు పంటలు నీటమునిగాయి. ఇప్పటికే సాగు చేపట్టిన పత్తి పంట, వరినార్లు, మిరపనార్లు, కంది, పెసర కూరగాయల పంటలు నీట మునిగి పనికిరాకుండా పోయాయి. మళ్లీ సాగు చేయాలంటే చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి నెలకొంది. గతేడాది సుమారు 30వేలకు పైగా ఎకరాల్లో పంటలు గోదావరి వరదలకు పూర్తిగా నష్టపోయాయి. కేంద్ర, రాష్ట్రాల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం అంచనా వేసి ప్రభుత్వాలకు నివేదికలు పంపారు. కానీ ఏ ప్రభుత్వమూ సాయం అందించలేదు. కనీసం రాయితీపై విత్తనాలు కూడా ఇవ్వలేదు.

పత్తి పంటకు ఎక్కువ నష్టం

భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో వేలాది ఎకరాలను వరద ముంచెత్తింది. బూర్గంపాడు, అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల్లో పత్తి పంట వరదపాలైంది. పత్తి సాగుకు ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.15వేల వరకు ఖర్చు చేశారు. మళ్లీ గింజలు కొని వేసుకోవాలంటే ఎకరాకు కనీసం రూ.8వేల వరకు ఖర్చవుతుంది.

వరి మరో నెల ఆలస్యం..

గోదావరి పరీవాహక భూములలో ఆగస్టులో నాట్లు వేయాలనే ఆలోచనతో రైతులు జూలై మొదటి వారంలో వరినార్లు పోసుకున్నారు. నాటేసేందుకు సిద్ధమవుతుండగా వరినారు మునిగి పూర్తిగా పాడైపోయింది. మళ్లీ నార్లు పోసుకుని నాట్లు వేయాలంటే మరో నెలరోజుల సమయం పడుతుంది. దీంతో ఖరీఫ్ పంట ఆలస్యం కావడంతోపాటు రబీ పంట మరింత ఆలస్యమవుతుంది.

మిర్చికి పెరిగిన పెట్టుబడి

గతేడాది మిర్చికి డిమాండ్ ఉండటంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం దాదాపు రెట్టింపైంది. భూములకు కౌలు ధరలు రెట్టింపు చెల్లించాల్సి వచ్చింది. మిరప గింజల రేట్లు కూడా అమాంతం పెరిగాయి. ఖర్చులు భరించి మిరపనార్లు పోస్తే, గోదావరి మింగేసింది. వరదలకు విద్యుత్ మోటార్లు, స్టార్టర్లు కూడా నీటమునిగాయి. గోదావరి వరదలను రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయి పరిశీలన చేసి నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కాగా వరదలు తగ్గాక జిల్లా అధికారుల సూచనలతో క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదిక పంపుతామని బూర్గంపాడు మండల వ్యవసాయాధికారి శంకర్ తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు తదుపరి చర్యలుంటాయని పేర్కొన్నారు.

అమలుకాని రుణమాఫీ

రుణమాఫీ అమలు కాకపోవటంతో రైతులకు తిరిగి పంటరుణాలు అందటం లేదు. ప్రభుత్వం రూ.లక్ష వరకు మాఫీ అమలు చేస్తామని చెప్పిన ఇప్పటి వరకు అమలు కాలేదు. రుణమాఫీ అమలు చేస్తే కొత్త పంటరుణాలు తీసుకునే వీలుంటుందని రైతులు అంటున్నారు. గోదావరి వరదలకు పంటనష్టపోయిన రైతులకైనా రుణమాఫీ అమలు చేస్తే తిరిగి పంటల సాగు పెట్టుబడులకు వెసులుబాటు ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు.

ఐదెకరాల్లో నష్టపోయాను



గోదారి వరదలకు ఐదెకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మూడు ఎకరాల పత్తి, రెండు ఎకరాల్లో కూరగాయలు పంట నీటమునిగి పూర్తిగా పాడయ్యాయి. ఇప్పటికే ఎకరానికి 15 వేల రూపాయలు ఖర్చు చేశాను. గత ఏడాది వరదలకు లక్షరూపాయల నష్టం వచ్చింది. ఈ ఏడాది రూ.75వేలు నష్టం. ఈసారైనా ప్రభుత్వం సాయం అందించాలి.

– రాసాల ముత్తయ్య, రైతు, బూర్గంపాడు

రూ.30 వేలు నష్టం



ఈ ఏడాది నేను మూడెకరాల్లో పత్తి వేశాను. ఇప్పటివరకు పెట్టుబడికి దాదాపు రూ.30 వేల వరకు ఖర్చయింది. గోదావరి వరదలతో పంట మునగడంతో పూర్తిగా నష్టపోయాను.

– కొండ్రు నరసింహమూర్తి, రైతు, బందారుగూడెం

400 ఎకరాల్లో దెబ్బతిన్న పత్తి పంట



బందారుగూడెంలో నీట మునిగిన పత్తి చేను

దుమ్ముగూడెం : పన్నెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు, వరదలతో 400 ఎకరాల్లో పత్తి పంట నీటమునిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. కళ్లముందే పంట నీటిలో నానిపాచిపోవడంతో రైతులు మనోవేదన చెందుతున్నారు. మండలంలోని తూరుబాక, నర్సాపురం, బి.కొత్తగూడెం, వైటీనాగరం గ్రామాల్లో పత్తి నీటమునిగింది. గోదావరి వెంబడి రెండు వైపులా రెండు కిలోమీటర్ల వరకు పంటలన్నీ మునిగిపోయాయి. నాలుగు రోజులపాటు నీళ్లలోనే ఉండటంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇసుక మేటలు వేశాయి. ఇసుక మేట తొలగించేదుకు ఎకరానికి రూ.20 వేలకు పైగా ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. మళ్లీ విత్తనాలు వేస్తే పెట్టుబడి పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

11కేవీపై కూలిన 33 కేవీ

- ఆ సమయంలో 11 కేవీ లైన్‌కు విద్యుత్ సరఫరా లేకపోవడంతో తప్పిన ప్రమాదం
- సమస్యను 'సాక్షి' ముందే ఎత్తి చూపినా నిర్లక్ష్యం వీడని విద్యుత్‌శాఖ అధికారులు



33 కేవీ లైన్ కూలి, దాని కిందనే ఉన్న మరోలైన్‌పై పడిన దృశ్యం

చర్ల: చర్ల మండలానికి ఎటపాకలోని 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యే 33 కేవీ విద్యుత్ లైన్ కూలిపడింది. ఆ సమయంలో దాని కింద ఉన్న 11 కేవీ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపి వేసి ఉండటంతో ప్రమాదం తప్పింది. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌కు భూసేకరణ చేసిన భూముల్లో నుంచి కరకట్ట నిర్మాణానికి మట్టిని తీసి తరలించే క్రమంలో... భద్రాచలం–వెంకటాపురం 33 కేవీ విద్యుత్ లైన్‌లో కుదునూరు సమీపంలో స్తంభాల చుట్టూ సుమారు 20 అడుగుల లోతు మట్టి తవ్వి వదిలేశారు. దీంతో స్తంభం పడిపోయే ప్రమాదం ఉండటంతో, ఈ సమస్యను 'సాక్షి' ముందే ఎత్తి చూపింది. గత మార్చి 16న 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన కథనం ప్రచురించింది. అయినా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గోదావరి వరదతో గోతుల్లో నీరు నిలవ్వగా, సోమవారం తెల్ల వారుజామున స్తంభం, లైన్ కూలి 11 కేవీ లైన్‌పై పడింది. లైన్ కూలడంతో చర్ల మండలంలోని సత్యనారాయణపురం, చర్ల సబ్ స్టేషన్లకు సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో 11 కేవీ లైన్‌లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. ఒకవేళ విద్యుత్ సరఫరా ఉండుంటే సంబంధిత ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు మండలంలోని విద్యుత్ వినియోగదారుల గృహోపకరణాలు కాలిపోయేవి. షార్ట్ సర్క్యూట్ ఏర్పడి అగ్ని ప్రమాదాలకు దారితీసే అవకాశం కూడా లేకపోలేదు. కాగా వెంకటాపురం వైపు నుంచి కూడా 33 కేవీ విద్యుత్ లైన్ ఉండటంతో చర్ల మండలంలో అంధకారం నెలకొనకుండా విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఇకనైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో ఇంకా ప్రమాదభరితంగా ఉన్న స్తంభాలను మార్చాలని పలువురు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..



మార్చి 16న 'సాక్షి'లో ప్రచురితమైన కథనం

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

బీజేపీ నాయకుడు సుధాకర్ రెడ్డి

చుంచుపల్లి: జిల్లాలో ముంపు ప్రాంతాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చుంచుపల్లి విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.1000 కోట్ల నిధులు ప్రకటనలకే పరిమితం అయ్యాయని విమర్శించారు. బంగారు తెలంగాణ పేరుతో సీఎం ప్రజలకు సినిమాను చూపిస్తున్నారని ఆరోపించారు. పునరావాస శిబిరాల్లో కనీస వసతులతోపాటు ఆహారాన్ని సైతం సకాలంలో అందించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఎస్డీఎఫ్ నిధులను రూ. 900 కోట్లు విడుదల చేసినా ఒక్క పైసా ఖర్చు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రసాదం పథకంలో రూ. 42 కోట్లను భద్రాచలానికి ఇచ్చినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థను కించపర్చుతూ ప్రజాపాలన గాలికి వదిలేసిందని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు ఆదివాసీలను పీడిస్తున్నారు : ఓఎస్డీ

కొత్తగూడెంటౌన్: అమరవీరుల వారోత్సవాల పేరిట నిర్వహించే మీటింగ్‌లకు రావాలంటూ ఆదివాసీలను మావోయిస్టులు పీడిస్తున్నారని ఓఎస్డీ సాయి మనోహర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీటింగ్‌కు రానివారు రూ. 3 వేల చొప్పున జరిమానా చెల్లించాలని హుకుం జారీ చేస్తూ బెదిరించడం హేయమైన చర్య అని, వారోత్సవాల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆదివాసీలను రక్షించేందుకు పోలీస్ శాఖ తరఫున చర్యలు తీసుకుంటామని తెలిపారు. మావోయిస్టుల కార్యకలాపాలను ప్రతిఘటించేవారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ముంపు తగ్గింది.. బురద మిగిలింది



స్నానఘట్టాల వద్ద మెట్లపై బురద



కల్యాణకట్ట భవనంలో పేరుకుపోయిన బురద

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నదిలో వరద ఉధృతి తగ్గిపోయింది. దీంతో సోమవారం చాలా వరకు స్నానఘట్టాల వద్ద మెట్లు బయటపడ్డాయి. కానీ వాటిపై భారీగా బురద పేరుకుపోవడంతో అధికారులు భక్తులను గోదావరిలో దిగేందుకు అనుమతించడం లేదు. నది ఒడ్డున స్నానఘట్టాల వద్ద ఉన్న ఆలయాల్లో సైతం ఒండ్రు మట్టి పేరుకుపోయింది. భక్తులు తలనీలాలు సమర్పించే కల్యాణ కట్ట భవనంలో కూడా బురద నిలిపోయింది. గోదావరి నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 40 అడుగులకు తగ్గింది. ఇంకా కొంచెం తగ్గితే పారిశుద్ధ్య పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. కాగా గోదావరి వరదతో కొట్టుకొచ్చిన పాములు కరకట్ట పరిసరాల్లో సంచరిస్తున్నట్లు విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది పేర్కొంటున్నారు.

ఉరివేసుకుని బలవన్మరణం



జాని (ఫైల్)

పాల్వంచరూరల్: కుటుంబ సమస్యలతో మనోవేదన చెంది ఓ వ్యక్తి సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని కేశవాపురం గ్రామానికి చెందిన కణతాల జాని(34) పెద్దమ్మగుడి వద్ద స్వచ్ఛందంగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం భార్య విడాకులు ఇచ్చింది. తల్లి వృద్ధురాలు. అన్న దివ్యాంగుడు. ఈ క్రమంలో కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని మృతిచెందాడు. ఎస్‌ఐ కార్తీక్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలుడి ఆత్మహత్య

టేకులపల్లి: తల్లిదండ్రులు మందలించారని ఓ బాలుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. బోడు ఎస్‌ఐ బత్తిని రంజిత్ కథనం ప్రకారం.. బర్లగూడెం గ్రామానికి చెందిన వజ్జా శ్రీనుకు ఇద్దరు కుమారులు. ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ పనుల్లో తల్లిదండ్రులకు సహాయంగా ఉంటున్నారు. చిన్న కుమారుడు నవీన్(15) మద్యానికి బానిసై రోజూ ఇబ్బందులకు గురిచేస్తుండటంతో ఆదివారం తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెంది రాత్రి పూట పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

చర్ల: మండల కేంద్రమైన చర్లలోని అంబేడ్కర్ నగర్‌లో గత నెల 24న రాత్రి చిప్పనపల్లి నాగేంద్రబాబు అనే యువకుడిని రోకలిబండతో తలపై మోదడంతో వరంగల్‌లోని ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనలో నిందితుడు కనుకు సంతోష్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

పచ్చిరొట్టతో అధిక దిగుబడులు

కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ నారాయణమ్మ



పచ్చిరొట్ట వేసిన పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చండ్రుగొండ/జూలూరుపాడు : పంటపొలాల్లో పచ్చిరొట్ట వేయడం ద్వార అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ నారాయణమ్మ అన్నారు. సోమవారం ఆమె చండ్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లో జీలుగులు, జనుములు వేసిన పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చిరొట్ట ఏపుగా పెరిగాక కలియదున్నితే భూ సారం పెరుగుతుందని అన్నారు. పత్తి మొక్కలు నీట మునిగిన ఎర్రబారితే 13–0–45 లేదా 2 శాతం యూరియా లేదా 19–19–19లలో ఏదో ఒకటి 10 గ్రాములు లీటర్ నీటిలో కలిపి మొక్క తడిసే విధంగా పిచికారీ చేయాలని, దీంతో మొక్క ఆరోగ్యంగా పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ, ఏడీఏ జి లాల్‌చంద్, ఏఓ వినయ్, ఏఈఓలు గౌస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు పంచాయతీలతోనే భద్రాద్రి అభివృద్ధి

సీపీఎం నేత పోతినేని సుదర్శన్



చెక్‌డ్యామ్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంటౌన్: దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాద్రి పుణ్యక్షేత్ర అభివృద్ధి ఆంధ్రలో కలిపిన ఐదు పంచాయితీలతోనే సాధ్యమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ పేర్కొన్నారు. పట్టణంలోని గోదావరి ముంపు కాలనీలను సోమవారం సీపీఎం నాయకులు సందర్శించి పరిశీలించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రి వర్గంలో ఉన్నా భద్రాద్రి రక్షణపై మాట్లాడటం లేదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఐదు పంచాయతీలను ఆంధ్రలో కలిపి భద్రాద్రి మరణ శాసనంపై తొలి సంతకం పెట్టిందని ఆరోపించారు. రామాలయం చుట్టు నీరు చేరడానికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే కారణమని విమర్శించారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతీ కుటుంబానికి రూ.25 వేలు నష్ట పరిహారం చెల్లించాలని, భద్రాద్రికి ముంపు నుంచి శాశ్వత పరిష్కారం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ. వెయ్యి కోట్లతో పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య, మచ్చ వెంకటేశ్వర్లు, కారం పుల్లయ్య, గడ్డం స్వామి, ఎంబీ నర్సారెడ్డి, వెంకటరెడ్డి, రేణుక పాల్గొన్నారు.

నిధులు నదులపాలు

పాల్వంచరూరల్: ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల నిధులు నదులపాలవుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ విమర్శించారు. మండల పరిధిలోని నాగారం వద్ద కిన్నెరసాని వాగులో ఇటీవల వరదకు కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నాణ్యతాలోపం కారణంగా చెక్‌డ్యామ్ వరదకు కొట్టుకుపోయిందని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు దొడ్డ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నాగారం చెక్ డ్యాం నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన చెక్ డ్యామ్‌ను పరిశీలించి మాట్లాడారు. బీజేపీ నాయకులు యడ్లపల్లి శ్రీనివాసకుమార్, పానిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య కారణాలతో ఆటోడ్రైవర్..

చుంచుపల్లి: మండల పరిధిలోని చుంచుపల్లి తండాకు చెందిన ఆటోడ్రైవర్ అనారోగ్యంతో బాధ పడుతూ ఆత్మహత్య చేసుకున్నాడు. చుంచుపల్లి తండాకు చెందిన బానోత్ వీరన్న (45) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. షుగర్‌తోపాటు మెదడుకు ఇన్‌ఫెక్షన్ రావడంతో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపం చెంది ఆదివారం అర్ధరాత్రి మద్యంలో ఎలుకల మందు కలుపుకుని తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై చుంచుపల్లి పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

జ్వరంతో వ్యక్తి మృతి

బూర్గంపాడు: మండల పరిధిలోని సోంపల్లి గ్రామానికి చెందిన పెంకె లక్ష్మయ్య (36) జ్వరంతో బాధపడుతూ సోమవారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. జ్వరంతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు అతనిని వారం రోజుల క్రితం పాల్వంచలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రెండు రోజుల అనంతరం కొద్దిగా కోలుకోవటంతో ఇంటికి తీసుకొచ్చారు. మరునాడే మళ్లీ జ్వరం ఎక్కువగా కాగా భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఖమ్మం సిఫారసు చేశారు. ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో కొత్తగూడెం వద్ద మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల సోంపల్లిలో జ్వరాలు ప్రబలి పలువురు మంచం పట్టారు. ఈ తరుణంలో లక్ష్మయ్య మృతితో గ్రామస్తుల్లో ఆందోళన నెలకొంది. మృతదేహాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, స్థానిక నాయకులు సందర్శించి, సంతాపం తెలిపారు.

రైలుకింద జారిపడి ప్రయాణికుడు..



ధన్‌సింగ్ (ఫైల్)

టేకులపల్లి: రైలుకింద జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ అంబేడ్కర్ కాలనీకి చెందిన భిమల్ ధన్‌సింగ్(65) సోమవారం తన మనుమరాలు సాహితిని తీసుకుని నెక్కొండలోని కూతురు వద్దకు కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరాడు. తడికలపూడి రైల్వేస్టేషన్ వద్ద క్రాసింగ్ కోసం రైలు కొద్దిసేపు నిలపగా ధన్‌సింగ్ కిందకు దిగాడు. తర్వాత రైలు కదలగానే ఎక్కబోయి కాలుజారి రైలు పట్టా లపై పడ్డాడు. నడుము మీది నుంచి రైలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డోర్నకల్ జీఆర్‌పీ ఎస్‌ఐ కె.శ్రీకాంత్, కొత్తగూడెం ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ జీఎస్.స్వామి పంచనామా నిర్వహించారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామ పంచాయతీలో గోపాలపురం గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మణుగూరు మండలం పద్మగూడెం గ్రామానికి చెందిన ధర్మసోత్ రాజేష్(28) బైక్‌పై మణుగూరు వైపు వెళ్తుండగా అశ్వాపురం వైపు వస్తున్న టాటామ్యాజిక్ ఢీకొట్టింది. దీంతో రాజేష్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

నేటి నుంచి శ్రీవారి పుష్కరిణి మూసివేత

తిరుమల: శ్రీవారి ఆలయం వద్ద ఉన్న పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపట్టేందుకు గాను మంగళవారం నుంచి 31వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేస్తున్నారు. నెల రోజుల పాటు పుష్కరిణి హారతి ఉండదు. పుష్కరిణి మరమ్మతుల కోసం మొదటి పది రోజుల పాటు నీటిని తొలగిస్తారు. ఆ తర్వాత పది రోజులు మరమ్మతులు ఏవైనా ఉంటే పూర్తి చేస్తారు. చివరి పది రోజులు పుష్కరిణిలో నీటిని నింపి పూర్తిగా సిద్ధం చేస్తారు. పుష్కరిణిలోని నీటి పీహెచ్ విలువ ఏడు ఉండేలా చూస్తారు. టీటీడీ వాటర్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ పనులు చేపడుతున్నారు. శ్రీవారి భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు వీలుగా పుష్కరిణి పైభాగంలో టీటీడీ షవర్లు ఏర్పాటు చేసింది.

వరద బాధితులపై సర్కార్ నిర్లక్ష్యం

కిషన్‌రెడ్డి, ఈటల సమక్షంలో పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యేలు శ్రీదేవి, సంజీవరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో ప్రజలు నష్టపోయి అల్లాడుతుంటే వారిని ఆదుకోకుండా కేసీఆర్ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ. 900 కోట్లకుపైగా ఉన్న జాతీయ విపత్తు నిధులతో బాధితులకు తాత్కాలిక సాయం కూడా అందించలేకపోయిందని ధ్వజమెత్తారు. వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను పర్యటించినప్పుడు సర్కార్ నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపించిందన్నారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డితోపాటు పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల, జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు సంజీవ్‌రావు (చెన్నూరు), అమరురాజుల శ్రీదేవి (బెల్లంపల్లి) ఆమె భర్త, బెల్లంపల్లి మాజీ మున్సిపాల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్నామన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 10 అసెంబ్లీ సీట్లూ గెలుస్తామని, మరో 10 మంది సీనియర్ నేతలు తమతో టచ్‌లో ఉన్నారని వెల్లడించారు.

సోయం వివరణ కోరతాం...

'ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు గిరిజన రిజర్వేషన్లపై చేసిన ప్రకటన ఆయన వ్యక్తిగతం. ఈ ప్రకటనతో పార్టీకి సంబంధం లేదు. దీనిపై ఆయన వివరణ తీసుకుంటాం. గిరిజన రిజర్వేషన్ల కోసం పోరాటంలో బీజేపీ ముందుంటుంది. అధికారంలోకి రాగానే లంబాడాలకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుంది. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గిరిజనులకు అన్యాయం జరిగింది. జనాభా ప్రాతిపదికన ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నా'అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

కొత్త న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం

- బాధ్యతలు చేపట్టిన జస్టిస్ సుజన, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్‌కుమార్
- సీజేతో కలిపి 30కి చేరిన న్యాయమూర్తుల సంఖ్య

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా జస్టిస్ కళాసికం సుజన, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ, జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఫస్ట్ కోర్టు హాల్లో ఉదయం 9.45 గంటలకు జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి పలువురు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, న్యాయవాదులు తదితరులు హాజరయ్యారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసిన సుజన, లక్ష్మీనారాయణ, అనిల్ కుమార్‌లను అదనపు జడ్జీలుగా నియమిస్తూ రాష్ట్రపతి గత వారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీరి నియామకంతో హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తితో కలిపి మొత్తం న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. ఇంకా శాశ్వత, అదనపు న్యాయమూర్తులు కలిపి 12 ఖాళీలున్నాయి. బాధ్యతలు చేపట్టిన తొలిరోజే కొత్త న్యాయమూర్తులు కేసుల విచారణలో పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న సీజే జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

సోమవారం సాయంత్రం తెలంగాణ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్త న్యాయమూర్తులు జస్టిస్ సుజన, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ అనిల్ కుమార్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు చెంగల్వ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గుదిబండ..'అప్పు'డే!

టీడీపీ దిగిపోయే నాటికి రాష్ట్రంపై రుణ భారం రూ.2,64,451 కోట్లు

ఇప్పుడు నాలుగేళ్లలో రూ.1,77,991 కోట్లే

- పార్లమెంట్ సాక్షిగా వాస్తవాలు మరోసారి వెలుగులోకి
- ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు లోబడే ఏపీ అప్పులు
- లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



సాక్షి, అమరావతి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ అప్పులపై టీడీపీతో పాటు దాని అనుబంధ ఎల్లో మీడియా చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం చేసిన తాజా ప్రకటనతో మరోసారి తేలిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాలుగేళ్లలో చేసిన అప్పులు రూ.1,77,991 కోట్లు మాత్రమేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం లోక్‌సభకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో స్పష్టం చేశారు. 2019 నాటికి ఏపీకి రూ.2,64,451 కోట్లు అప్పులుండగా 2023 మార్చి నాటికి రూ.4,42, 442 కోట్లకు చేరినట్లు తెలిపారు. ''ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అసెస్ చేస్తోందా? 2019 మే నుంచి ఏపీ ప్రభుత్వం ఎన్ని అప్పులు చేసింది? ఆర్థిక పరిస్థితిని అంచనా వేశారా?..'' అంటూ నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణరాజు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం ద్రవ్య జవాబుదారీ బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బీఎం) నిబంధనల మేరకు వ్యవహ రిస్తోందని తేల్చి చెప్పారు. ద్రవ్యలోటు తగ్గింపు, వివేకంతో కూడిన రుణ నిర్వహణ విధానాలకు అనుగుణంగా ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాల్లో సుస్థిరత, పారదర్శకతను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఎఫ్ఆర్‌బీఎంను అసెంబ్లీ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులకు లోబడే ఏపీ అప్పులు ఉన్నాయని వెల్లడించారు. ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులను, ఆర్థిక పరిమితులను అమలు చేస్తున్నారా.. లేదా? అనే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖకు చెందిన వ్యయ విభాగం పరిశీలన చేస్తూ ఉంటుందని వివరించారు.

కాకి లెక్కలతో పరిపాటిగా..

టీడీపీ దుష్ప్రచారానికి నిత్యం వంత పాడుతున్న ఎల్లో మీడియా అప్పులపై తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తాజాగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో మరోసారి తేటతెల్లమైంది. ఒకసారి రూ.8 లక్షల కోట్లు అప్పులు చేశారని, మరోసారి రూ.పది లక్షల కోట్ల అప్పులంటూ కాకి లెక్కలతో కథలు అల్లటం ఎల్లో మీడియాకు రివాజుగా మారింది. ఈ విష ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉన్నా రహస్యంగా అప్పులను దాచారనే విధంగా ఎల్లో మీడియా అవాస్తవాలను వండి వారుస్తోంది. పరిమితులకు లోబడే అప్పులు తీసుకుంటున్నామని, టీడీపీ హయాంతో పోలిస్తే పరిస్థితి ఎంతో మెరుగ్గా ఉందని రాష్ట్ర ప్రభుత్వం పలు దఫాలు స్పష్టం చేసింది. తీసుకున్న అప్పులను సామాజిక హితం కోణంలోనే ఖర్చు చేస్తోంది. భారీగా సంక్షేమ పథకాలు, నగదు బదిలీతో పేదలకు లబ్ధి చేకూరుస్తోంది. కోవిడ్ సమయంలోనూ డీబీటీతో పేదలను ఆదుకోవడం ద్వారా ప్రజల కొనుగోలు శక్తి క్షీణించకుండా చర్యలు తీసుకుంది. తద్వారా ఆర్థిక వ్యవస్థ మందగమనం బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంది. పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వ ప్రకటనతో ఇవన్నీ ముమ్మాటికీ నిజమని రుజువైంది. ఈ గణాంకాలను ఆర్బీఐ నివేదిక ప్రకారం వెల్లడిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి తన సమాధానంలో పేర్కొన్నారు. ఇప్పటికైనా పాఠకులకు తప్పుడు సమాచారాన్ని చేరవేయకుండా విశ్వసనీయతతో జర్నలిజం విలువలను పాటించాలని ఆర్థిక రంగ నిపుణులు సూచిస్తున్నారు.

ఆ 3 పార్టీలూ ఒక్కటే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంల డీఎన్ఏ ఒక్కటే
- అందుకే ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నాయి
- కుటుంబాల చేతుల్లో అధికారం ఉంటే దేశం బాగుపడదు
- వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం ఖాయం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం ఒక్కటే. ఈ మూడు కుటుంబ పార్టీలే. వాటి డీఎన్ఏ కూడా ఒకటే. అందుకే ఆ మూడు పార్టీలు యూనిఫామ్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి)ను వ్యతిరేకిస్తున్నాయి. ముస్లిం మహిళలకు హక్కులు వద్దంటున్నాయి..'అని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'ఈ మూడు పార్టీలు ఒకే గూటి పక్షులు. గతంలో పొత్తు పెట్టుకున్నాయి. ఇందులో ఎవరికి ఓటేసినా బీఆర్ఎస్‌కు వేసినట్లే..'అని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో మహా ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్ చౌరస్తాలో నిర్వహించిన బహిరంగసభలో, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలు కలిసి ఉద్దేశపూర్వకంగా బీజేపీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ఏ పార్టీతో కలవలేదని, భవిష్యత్తులో కూడా కలవబోదని చెప్పారు. ప్రజలను మోసం చేసిన చరిత్ర సీఎం కేసీఆర్‌దని, గతంలో ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. కుటుంబాల చేతుల్లో అధికారం ఉంటే దేశం బాగుపడదన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ విజయం ఖాయమని చెప్పారు.

ఇప్పటికీ వైఎస్ హయాంలోని రేషన్ కార్డులే..

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన రేషన్‌కార్డులే తప్ప.. తెలంగాణలో కొత్తవి రాలేదని కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో పేదలకు రేషన్ కార్డులివ్వాలనే సోయి కేసీఆర్ సర్కారుకు లేదని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక మోసం చేశారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌కు ఓటేస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని చెప్పి.. వెన్నుపోటు పొడిచారన్నారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, రైతులకు ఎరువులు ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల జీవితాల్లో నిప్పులు పోశారని, టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని, దళితబంధు స్కీంను అమ్ముకుంటున్నారని, బీసీ బంధు పేరిట ఆ వర్గాలను మభ్యపెడుతున్నారంటూ విమర్శలు గుప్పించారు.

బీఆర్ఎస్ ఆట కట్టించాలి..

దేశంలో నరేంద్ర మోదీ నాయకత్వంలో నాలుగు కోట్లకు పైగా ఇళ్లు కట్టించామని, తెలంగాణలోనూ ఇళ్లు కట్టించాలని కోరినా ఇక్కడి బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. తొమ్మిదేళ్లుగా పేదలకు ఇళ్లు లేవు కానీ.. ప్రజాధనం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ముఖ్యమంత్రి రాజభవనాన్ని కట్టుకున్నారని ఆరోపించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీయించడమే కాకుండా లిక్కర్ తెలంగాణగా మార్చారని మండిపడ్డారు. తొమ్మిదేళ్లుగా తెలంగాణను దోచుకుంటున్న బీఆర్ఎస్ ఆట కట్టించాల్సిన అవసరముందని అన్నారు.

నియంత పాలనను అంతమొందిస్తాం: డీకే అరుణ

తెలంగాణలో నియంతపాలన అంతమయ్యే దాకా బీజేపీ నిద్రపోదని ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఈ ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లు ఇచ్చే వరకూ వదలబోమని, కేసీఆర్ ప్రభుత్వం ఇవ్వకుంటే బీజేపీ అధికారంలోకి వచ్చాక తామే ఇస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

సింగరేణిలో వైద్యుల పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు భర్తీ చేసేందుకు సోమవారం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాయలంలోని ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 30 పోస్టులను కాంట్రాక్టు విధానంలో భర్తీ చేయనుండగా 84 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరి సర్టిఫికెట్లను డైరెక్టర్(పా) బలరామ్ పరిశీలించారు. అధికారులు కట్టా బసవయ్య, బి.వెంకటేశ్వర రెడ్డి, పి.వేణుగోపాల్‌రావు, డి.నాగేశ్వరరావు, డాక్టర్ సునీల, నాగరాజు, సంతోష్‌కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

'ఓపెన్ స్కూల్'లో చేరండి..

కారేపల్లి: ఓపెన్ స్కూల్ విధానంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందడం ద్వారా ఉత్తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సూచించారు. కారేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ చెరుకుమళ్ల శ్రీనివాసరావుతో కలిసి ఆయన వాల్‌పోస్టర్లు విడుదల చేసి మాట్లాడారు. చదువు మధ్యలో మానేసిన వారికి ఈ విధానం వరమని తెలిపారు.

నేడు సామూహిక వ్రతాలు

ఖమ్మంగాంధీచౌక్: అధిక శ్రావణ పౌర్ణమి సందర్భంగా టీటీడీ సహకారంతో హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యాన మంగళవారం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగాం అసిస్టెంట్ కర్నాటి రామకృష్ణారెడ్డి తెలిపారు. మధిర మండలం దెందుకూరులోని శ్రీ కోదండ రామాలయం, ఇల్లెందు జేకే కాలనీలోని శ్రీ హరిహర క్షేత్రంలో వ్రతాలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, భక్తి, నీతి కథలపై పాఠశాల విద్యార్థులకు 3వ తేదీన కొత్తగూడెంలోని శ్రీ మాస్టర్ ఈకే విద్యాలయంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి

పాల్వంచ రూరల్: పాల్వంచలోని ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి 12గంటలకు జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పాల్వంచ మండలం నాగారం కాలనీలో మన్యం దేవీప్రసాద్ (26) పోస్ట్‌మ్యాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ద్విచక్ర వాహనంపై మరొకరితో కలిసి వెళ్తుండగా డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనంపై ఉన్న మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కాగా, అతివేగంగా వెళ్తుండడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. దేవీప్రసాద్ స్వస్థలం ఏపీలోని జగ్గయ్యపేట మండలం సీతారాంపురమని తెలిసింది.

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ..

- వరి సాగులో వెదజల్లే పద్ధతిపై రైతుల ఆసక్తి
- క్రమంగా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు
- ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఇదే మేలంటూ సూచనలు



విత్తనం వెదజల్లే పద్ధతిని పరిశీలిస్తున్న అధికారులు (ఇన్‌సెట్) వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి (ఫైల్)

ఇల్లెందురూరల్: పంటల సాగులో నానాటికీ ఖర్చులు పెరుగుతున్నాయి. ఈనేపథ్యాన నూతన విధానాలు, సాంకేతిక పద్ధతులను అందిపుచ్చుకుంటున్న పలువురు రైతులు ఖర్చు తగ్గించుకుని లాభసాటి దిగుబడులు పొందేలా ముందుకు సాగుతున్నారు. జిల్లాలో ప్రధాన పంట అయిన వరి సాగుకు కూలీల అవసరం పెరుగుతుండడంతో అందుబాటులోకి వచ్చిన నూతన విధానాలపై రైతులు మక్కువ కనబరుస్తున్నారు. అందులో ఒకటి విత్తనం వెద జల్లే పద్ధతి. ఈ పద్ధతిలో నారు పెంచడం, నాట్లు వేయడం తదితర పనులేమీ లేకపోవడంతో ఖర్చు తగ్గుతోంది. అంతేకాక తాజా వర్షాలతో పలుచోట్ల నారు కొట్టుకుపోయినందున ఈ విధానం మేలని అధికారులు సూచిస్తున్నారు.

సాగు ఖర్చులు తగ్గించడమే లక్ష్యంగా..

మారుతున్న పరిస్థితుల్లో వరి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోంది. అయితే, నార్లు పోసి, నాట్లు వేయడం రైతుకు భారంగా మారింది. రోజురోజుకు కూలీల కొరతతో పాటు రేట్లు కూడా పెరుగుతున్నాయి. కొన్ని సందర్భాలలో చీడపీడలు, వాతారణంలో వస్తున్న మార్పుల దృష్ట్యా సరైన దిగుబడి రాక నికర ఆదాయం తగ్గుతోంది. ఈనేపథ్యాన సంప్రదాయ పద్ధతిలో కాకుండా ప్రత్యామ్నాయ పద్ధతి అయిన వెదజల్లే పద్ధతి వైపు ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు.

ఏమిటీ విధానం?

సాధారణంగా వరి సాగు చేసే అన్ని నేలలు వెదజల్లే పద్ధతికి అనుకూలంగా ఉంటాయి. వరి నాటు వేసే విధానంలో మాదిరిగానే భూమిని చదునుగా చేసుకోవాలి. అలాగే, అనువైన రకాలను ఎంచుకుని విత్తన శుద్ధ చేయాలి. ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటర్ నీటిలో కిలో విత్తనం చొప్పున శుద్ధి చేసుకోవచ్చు. ఈ పద్ధతిలో సన్న రకాలైతే ఎకరానికి 15 నుంచి 16 కిలోలు, దొడ్డురకాలైతే 18 నుంచి 20 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. విత్తనాన్ని 24 గంటలు నానబెట్టి 12 నుంచి 24 గంటలు మండె కడితే విత్తనాల ముక్కు పగిలి తెల్ల మోను వస్తుంది. వీటిని నేరుగా పొలంలో వెదజల్లొచ్చు. ఒక ఎకరంలో చల్లడానికి రెండు గంటలు సరిపోతుండగా, ఒక రోజులో 3 నుంచి 4 ఎకరాల్లో విత్తుకోవచ్చు.

ఇవీ ప్రయోజనాలు

సంప్రదాయ పద్ధతిలో వరి సాగు చేసే రైతులు దుక్కులు సిద్ధం చేయడం, బురదనీటలో దున్నడం, గొర్రుతో చదును చేయడం, ఆ తర్వాత నారు నాటాల్సి ఉంటుంది. దీనికి ముందు నారు మడి సిద్ధం చేసి నారు పెంచాలి. కానీ వెదజల్లే పద్ధతిలో దుక్కులు సిద్ధం చేసుకుని నేలను చదును చేసి విత్తనాలు వెదజల్లితే సరిపోతుంది. ఈ పద్ధతిలో ఎకరానికి సుమారుగా రూ.6 వేల వరకు ఖర్చు తగ్గుతుందని వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. అంతేకాకుండా కనీసం పది రోజుల ముందే పంట చేతికొస్తుంది. ఇంకా దిగుబడి కూడా పెరుగుతుందని చెబుతున్నారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

వెదజల్లే విధానంలో కూడా సాధారణ పద్ధతిలాగే ఎరువుల మోతాదు సరిపోతుంది. కాకపోతే దమ్ములో నత్రజని ఎరువులు వేయకుండా కేవలం సిఫారసు చేసిన మోతాదులోనే భాస్వరం ఎరువు, సగం పొటాష్ ఎరువులు వేయాలి. నత్రజని ఎరువులను మూడు భాగాలుగా చేసి విత్తనం వేసిన 20, 40, 60 రోజులకు వేయాల్సి ఉంటుంది. మూడో దఫా నత్రజని ఎరువు వేసే సమయాన మిగిలిన సగం పొటాష్ ఎరువు వేసుకోవాలి. విత్తనం వెదజల్లిన 3 - 4 రోజులకు 80 నుంచి 100 గ్రాముల పైరజో సల్ఫ్యూరస్ ఇథైల్ కలుపు మందును ఎకరం పొలంలో పిచికారీ చేయాలి. విత్తిన 15 నుంచి 20 రోజుల దశలో కలుపు ఉంటే వెడల్పాటి ఆకు, గడ్డి జాతి నివారణకు ఎకరానికి ట్రయఫామోస్ ఇథాక్స్ కలిపి సల్ఫ్యూరస్ 90 గ్రాములు లేదా పెనాలక్సులమ్ సైహాల్‌పాప్ బ్యూటైల్ 800 మి.లీ. మందును 2 నుంచి 3 ఆకుల దశలో ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. వరుసలో ఉన్న కలుపును అంతర్‌కృషి ద్వారా సమర్థవంతంగా నివారించుకోవచ్చు.

పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది



ప్రస్తుతం వరిలో సాగు ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో వెదజల్లే పద్ధతి మంచి ఫలితాలను ఇస్తోంది. ఈ విధానం ద్వారా ఎకరాకు సుమారు రూ.6 వేల ఖర్చు తగ్గడంతోపాటు కూలీల కొరతను అధిగమించవచ్చు. ఇలా అనేక లాభాలు ఉండడంతో రైతులు వెద పద్ధతిపై ఆసక్తి చూపుతున్నారు.

– సతీష్, ఏఓ, ఇల్లెందు మండలం

మాణిక్‌రావ్ ఠాక్రేతో జానారెడ్డి, పొంగులేటి భేటీ

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రేతో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. మాజీ మంత్రి జానారెడ్డి నివాసంలో జరిగిన భేటీలో ప్రజావ్యతిరేక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించి కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా అవలంభించాల్సిన విధివిధానాలపై చర్చించినట్లు పొంగులేటి తెలిపారు. కాగా, సీనియర్ కాంగ్రెస్ నాయకుల సలహాలు, సూచనలతో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.


ఠాక్రేతో సమావేశమైన జానారెడ్డి, పొంగులేటి

గురుకులాల్లోని విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ


గురుకులంలో ప్రార్థన చేస్తున్న పీఓ ప్రతీక్, అధికారులు, విద్యార్థులు


పీఓకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే వీరయ్య

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలం: వరదలు తగ్గుముఖం పట్టిన నేపథ్యాన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండడంతో గిరిజన ఆశ్రమ పాఠశాల, గురుకులాలలో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్ సూచించారు. భద్రాచంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన గిరిజన దర్బార్‌లో ఆదివాసీ, గిరిజనుల దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే, విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా తరచూ పరీక్షలు నిర్వహించాలని, మెనూ ప్రకారం భోజనం అందిస్తూ మెరుగైన బోధన చేయాలని తెలిపారు. ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్ రాజ్, అధికారులు భీం, తానాజీ, మునీర్‌పాషా, సురేష్‌బాబు, ప్రభాకర్‌రావు, రమణయ్య, శ్రీనివాస్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీఓను కలిసిన ఎమ్మెల్యే

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌ను ఎమ్మెల్యే పొదెం వీరయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఏజెన్సీలో గిరిజనుల అభివృద్ధికి అమలవుతున్న పథకాలపై వారు సమీక్షించారు. నాయకులు సరెళ్ల నరేష్, నల్లపు దుర్గప్రసాద్, బలుసు నాగసతీష్, సరెళ్ల వెంకటేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గురుకులంలో తనిఖీ

భద్రాచలంలోని గిరిజన గురుకుల విద్యాలయాలను పీఓ ప్రతీక్ తనిఖీ చేశారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్న ఆయన, ఇటీవల పట్నా ఐఐటీలో సీటు సాధించిన కొర్సా లక్ష్మికి రూ.80 వేల విలువైన ఐపాడ్, సెల్‌ఫోన్ అందజేశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన గిరిజన బాలిక ఐఐటీలో సాధించటం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల, కళాశాల తరగతి గదులను పరిశీలించి బోధన, భోజనంపై వివరాలు ఆరా తీశారు. ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్, కళాశాల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.దేవదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవినీతిమయంగా బీఆర్ఎస్ పాలన

మాజీ ఎంపీ వి.హన్మంతరావు

పాల్వంచరూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఏ ప్రాజెక్టు చూసినా అవినీతి కనిపిస్తోందని మాజీ ఎంపీ వి.హన్మంతరావు విమర్శించారు. పాల్వంచ మండలం నాగారం వద్ద రూ.12.74 లక్షల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్ ఇటీవల వరదలతో కొట్టుకుపోగా సోమవారం ఆయన పరిశీలించారు. చెక్‌డ్యాం నిర్మించిన రెండేళ్లకే కొట్టుకుపోవడం ప్రభుత్వ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. నిర్మాణ సమయంలో సక్రమంగా పర్యవేక్షిస్తే ఈ పరిస్థితి ఎదురయ్యేది కాదని చెప్పారు. కాగా, చెక్‌డ్యాం కింద పంటలు నష్టపోయిన రైతులకు కాంట్రాక్టర్ ద్వారా పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. పీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, నాయకులు కొండం వెంకన్నగౌడ్, చంద్రగిరి, సత్యనారాయణ, శ్రీనివాసరాజు, పాపారావు, నాగేశ్వరరావు, జలగం కృష్ణ పాల్గొన్నారు.


చెక్‌డ్యామ్ కింద పంట నష్టపోయిన రైతుతో మాట్లాడుతున్న వీహెచ్

రామయ్యను దర్శించుకున్న వీహెచ్

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామిని సోమవారం మాజీ ఎంపీ వి.హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నాక ఉపాలయాల్లో పూజలు చేశారు. నాయకులు సరెళ్ల నరేష్, కొత్త సీతారాములు, అడబాల వెంకటేశ్వరరావు, భోగాల శ్రీనివాసరెడ్డి, బలుసు సతీష్, చెంచు సుబ్బారావు, తరుణ్ మిత్ర, సరెళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.